గ్యాంగ్‌స్టర్ డ్రామా 'థగ్ లైఫ్'

కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కలయికలో వచ్చిన 'నాయకన్' (1987) క్లాసిక్‌గా నిలిచిపోయింది. దాదాపు 36 ఏండ్ల విరామం తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలేర్పడ్డాయి. నేడు కమల్‌హాసన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. ఈ సినిమాకు 'థగ్ లైఫ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కమల్‌హాసన్ రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో కనిపించనున్నారు. అనౌన్స్‌మెంట్ వీడియోలో శత్రువులతో పోరు చేస్తూ యాక్షన్ మోడ్‌లో కనిపించారు కమల్. దుల్కర్ సల్మాన్, త్రిష, జయం రవి తదితరులు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి కె చంద్రన్, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, సమర్పణ: ఉదయనిధి స్టాలిన్ రెడ్ జెయింట్ మూవీస్, రచన-దర్శకత్వం: మణిరత్నం.

ప్రతి ట్విస్ట్‌కు థ్రిల్ ఫీలవుతున్నారు

' 'మా ఊరి పొలిమేర' తొలిపార్ట్ హిట్ అయ్యిందని మేం 'మా ఊరి పొలిమేర 2' తీయలేదు. సీక్వెల్‌కి ముందే ప్లాన్‌చేశాం. కేవలం దర్శకుడిపై ఉన్న నమ్మకంతోనే ఈ సినిమా చేశాం' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. సత్యం రాజేశ్, కామాక్షి భాస్కర్ల ముఖ్యతారలుగా డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2' ఈ శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత గౌరికృష్ణ విలేకరులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ ' ఇంతటి విజయాన్ని మేం ఊహించలేదు. రెండు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించిందీ సినిమా. చిన్న సినిమాగా విడుదలై పెద్ద సినిమా స్థాయి వసూళ్లను రాబడుతున్నది' అని నిర్మాత సంతోషం వెలిబుచ్చారు. టీమ్ అంతా కలిసి థియేటర్లు తిరుతున్నామని, ఇందులోని ప్రతి ట్విస్ట్‌కు ప్రేక్షకులు థ్రిల్ ఫీలవుతున్నారని, థియేటర్లలో ప్రేక్షకుల స్పందన చూసి, కష్టాన్ని మరిచిపోయామని నిర్మాత అన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలకు ప్రేరణగానే దర్శకుడు ఈ కథ రాసుకున్నాడని, నేపథ్యం కొత్తగా ఉండటం కూడా ఈ సినిమా విజయానికి ఓ కారణమని, ఇలాగే ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేసే సినిమాలు తీయడమే నిర్మాతగా తన లక్ష్యమని గౌరీకృష్ణ చెప్పారు.

ఊహిస్తేనే భయంగా ఉంది

సాంకేతికతను మంచి కోసం వాడితే అది సమాజానికి ఉపయుక్తమవుతుంది. లేకపోతే అవాంఛిత పర్యవసానాలకు దారితీస్తుంది. ఇటీవల కాలంలో డీప్ ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి, ముఖాలను మార్చేసి అసభ్యకరమైన వీడియోలను సోషల్ మీడియాలో పెట్టే ధోరణి

సైబర్ ముప్పు నుంచి మహిళలకు రక్షణ కల్పించాలి

- పార్లమెంటరీ స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలి
- 'ఎక్స్' ద్వారా రాష్ట్రపతి, ప్రధానికి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి
- సినీనటి రష్మిక మందన్న డీప్ ఫేక్ వీడియోపై ఆందోళన

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): సైబర్ ముప్పు నుంచి మహిళలకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టాలీవుడ్ హీరోయిన్ రష్మిక మందన్న డీప్‌ఫేక్ వీడియోను కొందరు సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో పోస్టు చేయడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేస్తూ.. సైబర్ ముప్పు నుంచి మహిళలను రక్షించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నదని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం చేపట్టాల్సిన సమగ్ర చర్యలపై పార్లమెంటరీ స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఎక్స్ (ట్విటర్) ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ట్యాగ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత పెట్టిన పోస్టుకు 264.1కే వ్యూస్ వచ్చాయి. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన ఆవశ్యకతపై ఎందరో నెటిజన్లు చర్చించారు.

యాక్షన్ ఎమోషన్ కలిస్తే జిగర్ తాండ

'జిగర్ తాండ' ఫస్ట్ పార్ట్‌లోనే నేను యాక్ట్ చేయాల్సింది. అప్పుడు వేరే ప్రాజెక్ట్‌లో బిజీగా ఉండటం వల్ల కుదర్లేదు. ఆ తర్వాత నేనే కార్తీక్ సుబ్బరాజ్ దగ్గరకెళ్లి 'జిగర్ తండా' సీక్వెల్ చేద్దామని అడిగాను. తను కథ తయారు చేయడానికి సమయం పడుతుందని అన్నాడు. కథ రెడీ అవ్వగానే నాకు ఫోన్ చేశాడు' అన్నారు హీరో లారెన్స్. ఆయన కథానాయకుడిగా, కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జిగర్ తాండ డబుల్ ఎక్స్'. కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం నెల 10న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా లారెన్స్, ఈ సినిమాలో ప్రత్యేక పాత్ర పోషించిన ఎస్.జె.సూర్య మీడియాతో సరదాగా ముచ్చటించారు. ఇది పీరియాడిక్ మూవీ అని, నేపథ్యం కొత్తగా ఉంటుందని, యాక్షన్, ఎమోషన్ కలగలిసిన కథాంశంతో రూపొందిన చిత్రం ఇదని లారెన్స్ అన్నారు. త్వరలోనే ముని 5, కాంచన 4 చిత్రాలను మొదలుపెట్టనున్నానని లారెన్స్ చెప్పారు. హైదరాబాద్‌లో రాఘవేంద్రస్వామి గుడి కట్టాలనే నిశ్చయంతో ఉన్నానని, తన సేవా కార్యక్రమాలు తెలుగునేలపై కూడా కొనసాగిస్తానని లారెన్స్ చెప్పారు. వందకోట్ల భారీ వ్యయంతో 'జిగర్ తండా డబుల్ ఎక్స్' చిత్రాన్ని నిర్మాత కార్తికేయన్ నిర్మించారని, ఇందులో లారెన్స్ గ్యాంగ్‌స్టార్‌గా, నేనేమో డైరెక్టర్ కావాలని తపించే వ్యక్తిగా నటిస్తున్నామని ఎస్. జె.సూర్య అన్నారు.

శృతిహాసన్

'భాగమతి-2' కోసం..

ఇటీవల విడుదలైన 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రం ద్వారా మంచి విజయాన్ని అందుకుంది అగ్ర కథానాయిక అనుష్క. నేడు ఆమె జన్మదినం సందర్భంగా 'భాగమతి-2' చిత్రాన్ని ప్రకటించారు. ఇది అనుష్క నటిస్తున్న 50వ చిత్రం కావడం విశేషం. లేడీ ఓరియెంటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో అనుష్క నటించిన 'భాగమతి' చిత్రం చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సీక్వెల్ కూడా ఆసక్తికరమైన కథ, కథనాలతో సాగుతుందని.. అనుష్క పాత్ర నవ్యరీతిలో ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

వినోదాలు పంచే 'సోదరా'

సంపూర్ణేష్‌బాబు, సంజోష్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సోదరా'. మన్మోహన్ మేనంపల్లి దర్శకుడు. చంద్ర చంగలా నిర్మాత. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అన్నదమ్ములిద్దరూ పెళ్లి కొడుకు గెటప్స్‌లో ఉన్న పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. 'అన్నదమ్ముల అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ హాస్యప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చక్కటి వినోదంతో పాటు ఎమోషన్స్ ఉంటాయి. త్వరలో ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ప్రాచీ బంసాల్, ఆరతిగుప్తా, బాబా భాస్కర్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి కెమెరా: జాన్ సంగీతం: సునీల్ కశ్యప్, నిర్మాణ సంస్థ: క్యాన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, మాంక్ ఫిలిమ్స్.

సంపూర్ణేష్‌బాబు, సంజోష్

ఒంటరి ప్రయాణంలో కిక్కే వేరు

ఏడాది ప్రారంభంలోనే డబుల్ హిట్లు అందుకుని శుభారంభం పలికింది శృతిహాసన్. ప్రస్తుతం 'ది ఐ' అనే ఇంగ్లీష్ సైకలాజికల్ థ్రిల్లర్‌లో నటిస్తూ బిజీగా ఉంది తను. ఇంత బిజీలోనూ సమయం చిక్కినప్పుడల్లా అభిమానులతో తన వ్యక్తిగత సోషల్ మీడియా ద్వారా ఇంటరాక్ట్ అవుతూ వుంటుంది శృతి. రీసెంట్‌గా అభిమానులతో ముచ్చటిస్తూ ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ' ఎప్పుడూ ఒకేచోట స్థిరంగా ఉంటే జీవితం బోర్‌గా ఉంటుంది. మనిషి ఎప్పటికప్పుడు రీచార్జ్ అవుతూ వుండాలి. అందుకే బోర్ కొడితే బ్రేక్ తీసేసుకుని కొత్త ప్రదేశంలో వాలిపోతుంటా. అలా చేయడం వల్ల నాలో కొత్త ఉత్సాహం వచ్చి చేరుతుంది. పైగా ఒంటరి ప్రయాణంలో ఉన్న కిక్కు మామూలుగా ఉండదు. మనతో మనం మాట్లాడుకునే అవకాశాన్ని ఒంటరి ప్రయాణం ఇస్తుంది' అంటూ తన మనసుని ఆవిష్కరించింది శృతి.

భయపెట్టే చండిక

నిషా, శ్రీహర్ష

వీర్, శ్రీహర్ష, నిషా, ఖుషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'చండిక'. తోట కృష్ణ దర్శకుడు. కోటిపల్లి ప్రొడక్షన్స్ పతాకంపై కె.వి.పాపారావు నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకానుంది. ఇటీవల ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రతి ఆత్మకు ఓ కథ ఉంటుంది. అయితే చండిక కథ మాత్రం ఇప్పటివరకు ఎక్కడా వినని విధంగా ఉంటుంది. చండిక ఎందుకు భయపెట్టాలనుకుంటున్నది అనే అంశం ఆసక్తికరంగా అనిపిస్తుంది' అన్నారు. ఈ సినిమాకు తానే కథనందించానని, ఈ నెలలోనే విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నగేష్, సంగీతం: చేతన్ విన్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: తోట కృష్ణ.

ప్రేమ, లక్ష్యం.. ఏది ముఖ్యం?

మారేష్ శివన్

' ఈ కథ రాసింది 2012లో. కథ కూడా ఆ టైమ్‌లో జరుగుతుంది. ఇందులోని అంశాలు ప్రతి మనిషికీ కనెక్టయ్యేలా ఉంటాయి. ప్రేమ, లక్ష్యం ఒకేసారి ఎంచుకోవాల్సివస్తే? అనే ప్రశ్నకు సమాధానమే ఈ కథ. సందేశంతో కూడిన ప్రేమకథ ఇది' అన్నారు దర్శకుడు మారేష్ శివన్. ఆయన దర్శకత్వంలో దినేష్‌తేజ్, హెబ్బాపటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధానపాత్రలు పోషించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి సాయిసుధాకర్ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మారేష్ శివన్, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ పాత్రికేయులతో ముచ్చటించారు. ప్రేమ, భావోద్వేగాల నడుమ సాగే ఈ కథలో సంగీతం ప్రధానబలం. సుభాష్ ఆనంద్ ఇచ్చిన నేపథ్యసంగీతం, పాటలు ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. నక్కిన త్రినాథరావు, బెల్లంకొండ శ్రీనివాస్, బెక్కం వేణుగోపాల్ తదితరులు ఈ సినిమా చూసి అభినందించారు. రెండువందల థియేటర్లలో ఈ నెల 10న సినిమా విడుదల కానుంది' అని చెప్పారు దర్శకుడు మారేష్ శివన్. ఈ సినిమాకు పనిచేసే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.